క్లుప్తంగా

హుండీ లెక్కింపు

ముషీరాబాద్: ముషీరాబాద్‌లో ప్రసిద్ధిగాంచిన మహంకాళి దేవాలయ హుండీని లెక్కించారు. బుధవారం ఆలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ చైర్మన్ ఎయిర్‌టెల్ రాజు పర్యవేక్షణలో ఈ లెక్కింపు కొనసాగింది. హుండీలో రూ.2,13,045ల కానుకలు వచ్చాయని ఆలయ కమిటీ చైర్మన్ ప్రకటించారు. గౌరీశంకర్ ఆలయ కమిటీ చైర్మన్ శ్రీధర్‌చారి, ధర్మకర్తలు పూస గోరఖ్‌నాథ్, రాజు, రూపశ్రీ, సదా, కమలాకర్‌రెడ్డి, దేవాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ అండాలు, ఈవో జ్యోతి తదితరులున్నారు.

బీఆర్‌ఎస్‌లోకి చేరికలు



బీఆర్‌ఎస్‌లో చేరిన పలువురు మహిళలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సీఎం కేసీఆర్ ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధిని చూసి ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున బీఆర్‌ఎస్ పార్టీలో చేరుతున్నట్లు ఆ పార్టీ యువజన నాయకులు ముఠా జైసింహ అన్నారు. బీఆర్‌ఎస్ రాంనగర్ డివిజన్ మైనార్టీ విభాగం ప్రధాన కార్యదర్శి అబ్దుల్ హర్షద్‌పాషా ఆధ్వర్యంలో బుధవారం డివిజన్‌లోని రాజీవ్‌గాంధీనగర్ బస్తీలో ముఠా జైసింహ సమక్షంలో వివిధ పార్టీలకు చెందిన మహిళలు, కార్యకర్తలు పార్టీలో చేరారు. జైసింహ మాట్లాడుతూ.. దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత కేసీఆర్‌కే దక్కుతుందన్నారు. పార్టీ సీనియర్ నాయకులు వెంకటకృష్ణారావు, డివిజన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రావులపాటి మోజెస్, మన్నె దామోదర్‌రెడ్డి, నితిన్, సంతోష్, సాబేర్, షబానాబేగం, పాండు తదితరులున్నారు.

'ఆయుష్మాన్ భవ' ప్రారంభం



ప్రారంభిస్తున్న కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్

కాచిగూడ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టి అమలు చేస్తున్న ఆయుష్మాన్ భవ కార్యక్రమాన్ని బుధవారం కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్ ప్రారంభించారు. తెల్ల రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని లబ్ధిపొందాలని సూచించారు. డాక్టర్ మనోజ్‌రెడ్డి, నర్సులు, ఆయాలు, స్థానికులు పాల్గొన్నారు.

పవర్ బోర్ ప్రారంభం



పవర్ బోర్‌ను ప్రారంభిస్తున్న ముఠా జైసింహ తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాగ్‌లింగంపల్లిలోని శ్రీరామ్‌నగర్ కమాన్‌బస్తీలో ఎమ్మెల్యే ముఠా గోపాల్, యువనేత ముఠా జైసింహతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని బస్తీల్లో పవర్‌బోర్‌ను వేయించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. బస్తీ నాయకులు సత్యనారాయణ, వెంకటేశ్వర్‌రావు, ప్రవీణ్, విష్ణు, భిక్షం, జితేందర్, శ్రీహరి, సురేష్ తదితరులున్నారు.

'డబుల్' ఇళ్ల కోసం మహిళల ఆందోళన

హిమాయత్‌నగర్: తమకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వకుండా మోసం చేస్తున్నారంటూ హిమాయత్‌నగర్ డివిజన్ స్ట్రీట్ నెంబర్ 14లోని మహిళలు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే కేవలం ఎన్నికలప్పుడే వాగ్దానాలు ఇచ్చి మభ్య పెడుతున్నారంటూ విమర్శించారు. ఈ మేరకు బుధవారం హిమాయత్‌నగర్ స్ట్రీట్ నెంబర్ 14లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కోసం మహిళలు నిరసనకు దిగారు. సొంత ఇళ్లున్నవారికే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేస్తున్నారని ఆరోపించారు. పలువురు మహిళలు మాట్లాడుతూ... ఏళ్ల తరబడి దరఖాస్తు చేసుకోవడానికే సరిపోతున్నదని, తమకు మాత్రం ఇళ్లను మంజూరు చేసేవారు లేరంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

అధ్యాపకుల ఆందోళనలపై చులకన తగదు

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలోని 12 వర్సిటీల కాంట్రాక్ట్ అధ్యాపకులు ఉద్యోగాల పర్మనెంట్ కోసం చేస్తున్న ఆందోళనలపై చులకనభావం తగదని జేఏసీ చైర్మన్ డా. ధర్మతేజ ధ్వజమెత్తారు. బుధవారం 14వ రోజు పెన్‌డౌన్-చాక్‌డౌన్ ఆందోళనలో భాగంగా ఓయూ క్యాంపస్ ఆర్ట్స్ కాలేజీ బస్టాప్ వద్ద ధర్నా చేపట్టారు. గతంలో సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగాల పర్మనెంట్ కోసం పోరాడుతుంటే వర్సిటీల అధికారులు, రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు.

పేదలకు అండగా 'గృహలక్ష్మి'

- ఇంటి నిర్మాణానికి రూ. 3 లక్షలు అందజేత
- 125 గజాల స్థలం వరకు పథకం వర్తింపు
- అంబర్‌పేట్‌లో 1800 మంది దరఖాస్తు



అంబర్‌పేట్ తహశీల్దార్ కార్యాలయం

అంబర్‌పేట్: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన గృహలక్ష్మి పథకానికి నియోజకవర్గం నుంచి అర్హులు పెద్ద సంఖ్యలో దరఖాస్తులు చేసుకుంటున్నారు. 125 గజాల స్థలం వరకు ఉన్న పేదలకు ఇంటి నిర్మాణానికి రూ. 3 లక్షల ఆర్థికసాయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందించేందుకు సిద్ధంగా ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నియోజకవర్గంలో ఇప్పటి వరకు దాదాపు 1800 దరఖాస్తులు రాగా.. అర్హులైన వారి నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ కొనసాగుతోంది. గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను అధికార యంత్రాంగం విచారిస్తుంది. అర్హత పొందిన వారికి రూ.3 లక్షలు మంజూరు చేసి రెండు విడతల్లో అందజేయనున్నారని సమాచారం.

దరఖాస్తుకు అర్హత...

- స్థలం ఉండి ఇంటి నిర్మాణం చేపట్టాలనుకునే వారికి ఈ పథకం వర్తిస్తుంది.
- ఇంటి నిర్మాణ స్థలం విధిగా మహిళల పేరుపైనే ఉండాలి. ఇంటి స్థలం రిజిస్టర్ లేదా నోటరీపై స్థల డాక్యుమెంటుపై ఈ పథకంతో లబ్ధి పొందవచ్చు.
- ఓటర్, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం ఉండాలి. స్థల యాజమానురాలు భర్త ఓటర్ కార్డు, ఆధార్ కార్డు ఉండాలి.
- మీ సేవలో దరఖాస్తు ఫారం తీసుకుని వివరాలను పూర్తి చేయాలి.

పేదల ఇంటి నిర్మాణానికి అండ..



ఇంటి నిర్మాణం కోసం ఆర్థికంగా చేయూతనివ్వడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. నియోజకవర్గంలో ఈ పథకంపై విస్తృతంగా ప్రజలకు అవగాహన కల్పించటం జరిగింది. ఖాళీ స్థలంతో పాటు ఉన్న ఇంటిపై మరో అంతస్తు నిర్మాణం, మరమ్మతులు సైతం గృహలక్ష్మి పథకంతో చేయూతనివ్వడం జరుగుతుంది దళారులను ఆశ్రయించకుండా నేరుగా నా దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాను. - ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

అభివృద్ధి పనులు ప్రారంభం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బాగ్‌లింగంపల్లిలోని మదర్‌డైరీ పార్కులో రూ.35 లక్షలతో అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ముఠా గోపాల్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్కులో పిల్లల ఆటవస్తువులతో పాటు రెయిలింగ్, ప్రహరీ, బెంచీలు తదితర అభివృద్ధి పనులకు నిధులు ఖర్చు చేస్తున్నట్లు పేర్కొన్నారు. పార్కును అన్ని విధాలుగా సుందరీకరించేందుకు మరిన్ని నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. నియోజకవర్గ ప్రజల ఆశీర్వాదంతో మరోసారి తాను గెలుస్తానని ధీమా వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలు బస్తీలకు చెందిన పేదలకు డబుల్‌బెడ్రూం ఇళ్లు, డ్రైనేజీ, నీటి సరఫరా తదితర సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఎంఐజీ-2 పార్కు వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రత్నాకర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ కె.రవిచారి, ముఠా జైసింహ, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు వెంకటకృష్ణరావు (బబ్లూ), ముచ్చకుర్తి ప్రభాకర్, డివిజన్ అధ్యక్షులు రావులపాటి మోజెస్, ఎం.దామోదర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు రాజేంద్రప్రసాద్‌గౌడ్, ఎస్.రమేష్‌రెడ్డి, ఉపాధ్యక్షులు శంకర్‌గంగపుత్ర, కల్పన, మనోహర్‌రెడ్డి తదితరులున్నారు.

దీక్షకు మద్దతు

ముషీరాబాద్: ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డి ఇందిరాపార్కు వద్ద చేస్తున్న 24 గంటల నిరాహార దీక్షకు నియోజకవర్గం నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివెళ్లారు. రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ సూర్యనారాయణ ఆధ్వర్యంలో అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షులు నరేష్ తదితరులు ఈ దీక్షలో పాల్గొని కిషన్‌రెడ్డికి సంఘీభావం ప్రకటించారు.

ఉత్తమ సమాజానికి ఉపాధ్యాయులే కీలకం



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

అంబర్‌పేట్: ఉత్తమ సమాజ నిర్మాణానికి ఉపాధ్యాయుల పాత్ర కీలకమని దుర్గభాయ్ దేశ్‌ముఖ్ నర్సింగ్ కళాశాల చైర్‌పర్సన్ ఎం.సులోచన తెలిపారు. ఆల్ ఇండియా లీనేష్ సర్వీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నర్సింగ్ కళాశాలలోని ఉత్తమ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ సులోచన ముఖ్య అతిథిగా హాజరై ఉపాధ్యాయులను ఈ సందర్భంగా అభినందించారు. ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులకు ఓర్పు, సహనం నేర్పించాలని సూచించారు. సంస్థ అధ్యక్షురాలు లీనేష్ విజేత, ప్రతినిధులు స్వర్ణలత, సురేఖ, శైలజారాం తదితరులున్నారు.

'రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువు'



ఉపవాసదీక్షలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో కె.గీతామూర్తి

కాచిగూడ: రాష్ట్రంలో మహిళలకు భద్రత లేకుండా పోయిందని బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు కె.గీతామూర్తి అన్నారు. నిరుద్యోగ యువతను దగా చేసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి బుధవారం ఇందిరాపార్క్ వద్ద చేపట్టిన ఉపవాసదీక్షలో పార్టీ మహిళా మోర్చా ప్రతినిధులతో కలిసి ఆమె పాల్గొన్నారు. ఉపవాస దీక్షకు కాచిగూడలోని గీతామూర్తి నివాసం నుంచి మహిళలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. ఆమె మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ వల్లే నిరుద్యోగ యువత ఉద్యోగాలు రాక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆరోపించారు. బీజేపీ ఆధ్వర్యంలోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని, వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని గెలిపించి అభివృద్ధికి సహకరించాలని ఆమె ప్రజలను కోరారు.

కన్నుల పండువగా లక్షపుష్పార్చన



లక్షపుష్పార్చనలో పాల్గొన్న సంఘం సభ్యులు

చిక్కడపల్లి: చిక్కడపల్లి వాసవీ మహిళా సంఘం ఆధ్వర్యంలో లక్షపుష్పార్చన కార్యక్రమం కన్నుల పండువగా సాగింది. ఈ పుష్పార్చనతో శ్రావణ సంబరాల పేరిట గాంధీనగర్ డివిజన్ జవహర్ నగర్‌లోని శ్రీ లలితాపరమేశ్వరి దేవాలయంలో సంఘం అధ్యక్షురాలు శ్రీరాం విజయలక్ష్మి ఆధ్వర్యంలో బుధవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పంచామృత అభిషేకం, లక్ష పుష్పాలు, లక్షనామాలతో ముగ్గురమ్మలు మురిసేలా మూడుసార్లు లలితా పారాయణం చేసి అమ్మవారిని పూజించారు. శ్రీరాం విజయలక్ష్మి మాట్లాడుతూ.. అమ్మవారి కృపకు పాత్రులయ్యే మాసం శ్రావణమాసమని ఈ కాలంలో ప్రతి ఇంటా ప్రతిరోజు ఆ మహాలక్ష్మిదేవి సేవలకు అంకితం అవుతామన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి గోలి మాలతి, వ్యవస్థాపక అధ్యక్షురాలు కె.ఎస్.వరలక్ష్మి, కోశాధికారి ఎస్.వసంత, శకుంతల, ప్రేమలత, మణికుమారి, ధనలక్ష్మి, శైలజ, అనురాధ, కల్యాణి, రవళి, లక్ష్మి, గిరిజ తదితరులున్నారు.

ఘనంగా సర్వ భాషా సమ్మేళనం



సర్వ భాషా సమ్మేళన వేడుకల్లో మాట్లాడుతున్న డాక్టర్ వెంకట్‌రావు



విద్యార్థుల సాంస్కృతిక నృత్య ప్రదర్శనలు

కాచిగూడ: సంస్కృతం వేదకాలం నాటి నుంచి ఉన్న ప్రాచీన భాష అని, ప్రపంచ భాషలన్నింటికీ మూలం సంస్కృత భాష అని ఉస్మానియా యూనివర్సిటీ సంస్కృతం శాఖ ప్రొఫెసర్ డాక్టర్ విద్యానంద ఆర్య అన్నారు. బుధవారం అవంతి డిగ్రీ కళాశాలలో సర్వ భాషా సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. సంస్కృత భాషలో 700ల కోట్లకు పైగా శబ్దాలున్నాయని, శబ్దాలకు ఎంతో సామర్థ్యం ఉందన్నారు, ప్రతి శబ్దానికి ఎంతో అర్థం ఉందన్నారు. మాతృభాష మన తల్లి లాంటిదని, మాతృభాషలోని మాధుర్యాన్ని, చదువు విలువలని చక్కగా వివరించారు. డాక్టర్ వారిజా రాణి మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రతిభను ఉపయోగించి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చన్నారు. మాతృభాష నేర్చిన తర్వాతే మిగతా భాషలు నేర్చుకోవాలని సూచించారు. మన భావ వ్యక్తీకరణ మాతృభాషలోనే చేయాలన్నారు. ఏకాగ్రత, నిరంతర సాధనతో లక్ష్యాలు సాధించాలన్నారు విద్యార్థులకు సంస్కృతం, తెలుగు, హిందీ, అరబిక్ భాషల్లో సాంస్కృతిక కార్యక్రమాలు, వివిధ రకాల పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. తెలంగాణ మహిళా విశ్వ విద్యాలయం ప్రిన్సిపాల్ డాక్టర్ వారిజ రాణి, హిందీశాఖ చైర్‌పర్సన్, డాక్టర్ సంగీత, డాక్టర్ సైదాతాలత్ సుల్తానా, అవంతి కళాశాల డైరెక్టర్ డాక్టర్ వెంకట్‌రావు, సెకండ్ లాంగ్వేజెస్ హెచ్‌ఓడీ మాధవి తదితరులున్నారు.

అలయ్ బలయ్‌కి ఆహ్వానం



చిక్కడపల్లి: ముషీరాబాద్ మున్నూరుకాపు సంఘం కన్వీనర్, రాష్ట్ర నాయకులు గంగం రవిని జవహర్‌నగర్‌లోని ఆయన నివాసంలో హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ కుమార్తె, అలయ్ బలయ్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ బండారు విజయలక్ష్మి ఆహ్వాన పత్రికను బుధవారం అందజేశారు.

విద్యార్థులకు నాసిరకం భోజనం తగదు

కాచిగూడ: రాష్ట్రంలో సంక్షేమ హాస్టళ్లలో నాసిరకం భోజనంతో విద్యార్థులు తరచూ అస్వస్థతకు గురవుతున్నారని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం కాచిగూడలోని బీసీ మహాసభ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం గత కొన్ని నెలలుగా మెస్ బిల్లులు ఇవ్వకపోవడంతో విద్యార్థులకు నాసిరకం భోజనం పెడుతున్నారని ఆరోపించారు. నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలంలోని కస్తూర్బా బాలికల పాఠశాలలో కలుషిత ఆహారం తిన్న బాలికలు ఆసుపత్రిలో చేరి చికిత్స పొందుతున్నారని తెలిపారు. ఇటీవల తరచూ ఇలాంటి ఘటనలు జరుగుతున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. సమస్య శాశ్వత పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కమిటీని వేసి నివారణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. బీసీ మహాసభ నేతలు కిషోర్, కృష్ణ, ముత్యాల్ రావు, భూషణ్, భాస్కర్, ప్రదీప్‌గౌడ్ తదితరులున్నారు.

కాంగ్రెస్ విజయభేరిని జయప్రదం చేయండి

ముషీరాబాద్: ఈ నెల 16,17 తేదీల్లో తుక్కుగూడ వద్ద జరిగే కాంగ్రెస్ విజయభేరి సభ తెలంగాణ రాజకీయ ముఖచిత్రాన్ని మార్చి వేస్తుందని కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి రూబీ మనోహర్ అన్నారు. బుధవారం రాంనగర్ డివిజన్‌లోని రిసాలలో ముఖ్య కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అంజన్‌కుమార్‌యాదవ్, రూబీ మనోహర్‌లు హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో ఏం జరుగుతుందో దేశం మొత్తం చూస్తుందని, రాష్ట్రంలో కాంగ్రెస్ గ్రాఫ్ క్రమంగా పెరుగుతుందని రూబీ మనోహర్ అభిప్రాయపడ్డారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త గడపగడపకు వెళ్లి కాంగ్రెస్ పార్టీ ఇచ్చే హామీలను ప్రజలకు వివరించి అధికారంలోకి వచ్చేలా కృషి చేయాలని కోరారు. అంజన్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. తాను రెండుసార్లు ఎంపీగా ఉన్న సమయంలో ముషీరాబాద్ నియోజకవర్గానికే తన నిధులను కేటాయించి అభివృద్ధి చేశానన్నారు. మాజీ కార్పొరేటర్లు ఆర్.కల్పనాయాదవ్, వాజీద్ హుస్సేన్, రాంనగర్ డివిజన్ అధ్యక్షులు జేహేర్‌హుస్సేన్, పాశం అనిల్ కుమార్‌యాదవ్, అంజియాదవ్, పట్నం నాగభూషణంగౌడ్, జెనిగే శ్రీనివాస్, అభిషేక్ కెనడి, మేడి సురేష్, మురళీమోజెస్, వి.డి.కృష్ణ తదితరులున్నారు.

ఘనంగా ఆర్. కృష్ణయ్య జన్మదిన వేడుకలు



రాజ్యసభ ఎంపీ కృష్ణయ్యతో 68 కేజీల కేక్‌ను కట్ చేయిస్తున్న బీసీ సంఘం నేతలు

ముషీరాబాద్: రాజ్యసభ ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య 68వ జన్మదిన వేడుకలు బుధవారం హైదరాబాద్‌లోని బీసీ భవన్‌లో ఘనంగా జరిగాయి. ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు 68 శాతం పదవులు, చైర్మన్లు, ఎమ్మెల్సీలు, మంత్రి పదవులు ఇచ్చి దేశానికి ఆదర్శంగా నిలిచారని రమేష్ అనే బీసీ నాయకుడు కొనియాడారు. పార్లమెంటులో బీసీ బిల్లు పెట్టి చరిత్ర సృష్టించాలని ఆకాంక్షించారు. బీసీ సంఘం నాయకులు రాజ్‌కుమార్, రాజేందర్, నీల వెంకటేష్, గుజ్జ సత్యం తదితరులున్నారు.

- జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులకు బుక్స్, స్టేషనరీ సామగ్రి పంపిణీ చేశారు. బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్‌చేసి బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్యకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బూర్లపల్లి కృష్ణయాదవ్, సందీప్, రాజు, వెంకట్, హేమంత్, శ్రీకాంత్ తదితరులున్నారు.

ఆయుష్మాన్ భారత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



యూపీహెచ్‌సీ ప్రాంగణంలో మాట్లాడుతున్న కార్పొరేటర్ సుప్రియ

ముషీరాబాద్: పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ముషీరాబాద్ డివిజన్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్ కోరారు. బుధవారం ముషీరాబాద్‌లోని ప్రభుత్వ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రాంగణంలో ఆయుష్మాన్ భారత్ పథకాన్ని కార్పొరేటర్ ప్రారంభించారు. తెల్లరేషన్‌కార్డు కలిగిన అర్హులైన 50 మందికి ఈ పథకాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేశారు. కార్పొరేట్ ఆసుపత్రుల్లో రూ.5 లక్షల వరకు ఈ పథకం ద్వారా వైద్యసేవలు పొందవచ్చన్నారు. ముషీరాబాద్‌లో వాడవాడలా ఆయుష్మాన్ భారత్ పథకం నమోదు కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. బీజేపీ జాయింట్ కన్వీనర్ ఎం.నవీన్‌గౌడ్, వైద్యాధికారులు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ మౌనిక, పీహెచ్ఎన్ భాగ్యలక్ష్మి, బీజేపీ నాయకులు సత్యనారాయణ, వెంకటేష్, వేణు తదితరులున్నారు.

పేదల ఆరోగ్యానికి భరోసా..

అంబర్‌పేట్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకం దేశంలో పేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తుందని బాగ్ అంబర్‌పేట్ కార్పొరేటర్ పద్మావెంకట్‌రెడ్డి తెలిపారు. ఆయుష్మాన్ భారత్ పథకాన్ని రాష్ట్రపతి ద్రౌపదిముర్ము వర్చువల్‌గా రాష్ట్రంలో బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమాన్ని డివిజన్‌లో అయ్యప్ప ఆలయం వద్ద ఉన్న ప్రభుత్వ ప్రాథమిక కేంద్రంలో వైద్య సిబ్బందితో కలిసి కార్పొరేటర్ వీక్షించారు. ఈ పథకం ప్రాధాన్యత పేదలకు వివరించాలని ఆమె వైద్యారోగ్య సిబ్బందికి సూచించారు. ఆసుపత్రి వైద్యురాలు హార్షశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

రాజ్‌భవన్ నుంచి ప్రారంభించడం అభినందనీయం..

చిక్కడపల్లి: ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర ఆరోగ్యశాఖ ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భవ పథక వివరాలను రాష్ట్రపతి ద్రౌపదిముర్ము ఆయుష్మాన్ భవ ప్రచారాన్ని రాజ్‌భవన్ నుంచి ప్రారంభించడం అభినందనీయమని గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ పావనీవినయ్‌కుమార్ అన్నారు. బుధవారం గాంధీనగర్ డివిజన్‌లోని అరుంధతీనగర్‌లో బస్తీ దవాఖానాలో డాక్టర్ అనిత, స్టాఫ్‌నర్సు అనుపమ, గ్యాబ్రియల్‌తో కలిసి ఆమె వీక్షించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ఆయుష్మాన్ భవ క్యాంపెయిన్ లక్ష్యం, ఏ వ్యక్తిని వదిలేయకూడదన్నారు. సార్వత్రిక ఆరోగ్య కవరేజీ లక్ష్యాన్ని సాధించడంలో మనదేశం విజయవంతమవుతుందని రాష్ట్రపతి స్పష్టం చేశారన్నారు. బీజేపీ నగర యువ నాయకులు ఎ.వినయ్‌కుమార్, శ్రీనివాస్‌గౌడ్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

వచ్చే ఎన్నికల్లో పోటీకి సిద్ధంగా ఉండాలి



మాట్లాడుతున్న ప్రకాష్ అంబేడ్కర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వచ్చే ఎన్నికల్లో పోటీకి సిద్ధంగా ఉండాలని వంచిత్ బహుజన్ ఆఘాడి వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు ప్రకాష్ అంబేడ్కర్ పిలుపునిచ్చారు. తెలంగాణలోని అన్ని నియోజకవర్గాల నుంచి తమ పార్టీ పోటీ చేస్తుందని ఆయన స్పష్టం చేశారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన్ కేంద్రంలో ఆఘాడి రాష్ట్రస్థాయి కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రకాష్ అంబేడ్కర్ మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ, రాష్ట్రంలో బీఆర్‌ఎస్ పార్టీలను ఓడిస్తామని అభిప్రాయపడ్డారు. తాము గెలిచినా, గెలవకున్నా.. గెలిచే వారిని మాత్రం ఓడిస్తామన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని విమర్శించారు. ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు గవ్వల శ్రీకాంత్ మాట్లాడుతూ.. 'రాజ్యాంగ హక్కులను కాలరాస్తున్న ప్రభుత్వాలను అంతం' చేయాలన్నారు. ప్రశాంత్‌కుమార్, జెన్ను సాంబయ్య, సిద్దోజీ, ఏపీ బైండ్ల కులస్తుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు తిరుపతిరావు, మహిళా నాయకురాలు రజిత, కొప్పుల రామారావు, దీపక్‌కుమార్, సూర్యప్రకాష్ తదితరులున్నారు.

ఆహ్వానం అందజేత

చిక్కడపల్లి: ప్రసిద్ధిగాంచిన ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని లక్ష్మీ గణపతి దేవాలయంలో ఈ నెల 18 నుంచి నవరాత్రి మహోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు దేవాలయం కార్యనిర్వహణాధికారి లక్ష్మారెడ్డి అన్నారు. ఉత్సవాలకు హాజరు కావాలని బుధవారం ఆయన కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాజ్యసభ ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్‌లను కలిసి ఆహ్వానపత్రికను అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. 18 నుంచి, 30 వ తేదీ వరకు నవరాత్రి ఉత్సవాలు జరుగుతాయని వివరించారు. అర్చకులు గోపాలాచారి, సభ్యులు రమణామూర్తి, బీజేపీ నాయకులు రత్నసాయిచంద్, శ్రీకాంత్, సత్తిరెడ్డి పాల్గొన్నారు.



కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి ఆహ్వానపత్రికను అందజేస్తున్న ఈవో లక్ష్మారెడ్డి



ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్‌కు ఆహ్వానం అందజేత

ఓపెన్ నాలాలపై సేఫ్టీ పెన్సింగ్

ముషీరాబాద్: నియోజకవర్గంలోని లోతట్టు ప్రాంతాల వద్ద నాలాల వద్ద ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా యుద్ధ ప్రాతిపాదికన ఓపెన్ నాలాలపై సెఫ్టీ ఫెన్సింగ్ నిర్మాణ పనులు పూర్తి చేస్తున్నామని ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. బుధవారం డివిజన్‌లోని ఆశీర్వాద్ అపార్ట్‌మెంట్ వీధిలో రూ.30 లక్షలతో ఓపెన్ నాలాపై సెఫ్టీ ఫెన్సింగ్ నిర్మాణ పనులను ఎమ్మెల్యే కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భవిష్యత్తులో నాలాల నుంచి ముంపు ఏర్పడకుండా పనులు చేపడుతున్నామని కలుషిత నీటిసరఫరా సమస్యను పరిష్కరిస్తామన్నారు. బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ముఠా జైసింహ, బీజేపీ జాయింట్ కన్వీనర్ నవీన్‌గౌడ్, డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్ష, కార్యదర్శులు నర్సింగ్‌ప్రసాద్, శ్రీధర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు నాగులుయాదవ్, శివముదిరాజ్, దీన్‌దయాల్‌రెడ్డి, గౌరీశంకర్ ఆలయ కమిటీ చైర్మన్ శ్రీధర్‌చారి, డివిజన్ ఉపాధ్యక్షులు లక్ష్మణ్‌గౌడ్, బల్లా ప్రశాంత్, ఎస్సీసెల్ అధ్యక్షులు సదా, పూస గోరఖ్‌నాథ్ తదితరులున్నారు.

